కాత్యాయని దేవిగా బాసర సరస్వతి

» వైభవంగా దసరా నవరాత్రులు



కాత్యాయని రూపంలో అమ్మవారు

బాసర, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శనివారం అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలంగాణ, ఏపీతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తున్నారు.

దుర్గా పరమేశ్వరికి పోలీసు కమిషనర్ పూజలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో కొలువుదీరిన దుర్గాపరమేశ్వరి మాత మందిరంలో పోలీసు కమిషనర్ సాయిచైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం బాల త్రిపుర సుందరి రూపంలో ఉన్న అమ్మవారిని ఆయన దర్శించుకున్నారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రాంగణంలో నిర్వహించిన అన్నదానంలో భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



పూజలు చేస్తున్న సీపీ సాయిచైతన్య



దసరా రోజున రాజంపేటలో త్రివర్ణ పతాకం ఎగురగానే గాలి సైతం గర్వంగా సద్దు చేస్తుంది. జెండా కింద కుల మతాలకు అతీతంగా ప్రజల హృదయాలు ఏకమవుతాయి. ప్రతీ ఒక్కరి కృషి పతాకంలో నూరిన రంగుల్లా మిళితమై, గ్రామమంతా వసుధైక కుటుంబమని చాటుతుంది. దేశభక్తి రంగుల్లో మెరిసే జెండా కింద పండగ ఉత్సాహంగా జరుగుతుంటే... ఇలాంటి ఆచారం ప్రతీ పల్లెలో ఉండాలనే ఆశ అన్ని మనసులను మెల్లగా తాకుతుంది.

త్రివర్ణ.. దసరా

సండే స్పెషల్ SUNDAY SPECIAL

విజయదశమి రోజున జాతీయ పతాకావిష్కరణ

» రాజంపేటలో వినూత్న ఆచారం
» కులమతాలకు అతీతంగా సంబరాలు
» జెండా కింద ఏకతా.. తరతరాల సంప్రదాయం

రాజంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా దసరా పండగను శక్తి, శౌర్యానికి ప్రతీకగా జరుపుకొంటారు. కానీ కామారెడ్డి జిల్లా రాజంపేట మండల కేంద్రంలో మాత్రం ఈ పండగకు మరింత ప్రత్యేకత ఉంది. ఇక్కడ దసరా రోజున అన్ని కులాల ప్రజలు సమష్టిగా చేరి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. త్రివర్ణ పతకాన్ని ఎగరేసి పండుగను జరుపుకోవడం తెలంగాణలో ప్రత్యేక సంప్రదాయంగా నిలుస్తోంది. జెండా కింద జరిగే సంబరాలు ఏకతా, సమానత్వానికి ప్రతీకగా మారుతున్నాయి.

సమష్టిగా కులాల పాత్ర

జెండా ఆవిష్కరణలో ప్రతి కులానికి ప్రత్యేక బాధ్యతలు కేటాయిస్తారు. ఎవరికి వచ్చిన పనిని వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి జెండా పండుగను విజయవంతం చేస్తారు. దీనిలో భాగంగానే జెండా గద్దె నిర్మాణం, జెండా కర్ర నిలబెట్టడంతో పాటు రంగులు వేయడం కూడా సమష్టిగా పూర్తి చేస్తారు. ఇలా అందరూ కలిసి పని చేయడం ద్వారా గ్రామానికి మేలు కలుగుతుందని విశ్వసిస్తారు.

రెండు కుటుంబాల అనుబంధం

ఈ ఆచారంలో మాలిపటేల్ కాసం సిద్ధిరాంరెడ్డి, పోలీసు పటేల్ సత్యం కుటుంబాలు ప్రధానంగా పాల్గొంటున్నాయి. వారి ఆధ్వర్యంలో జెండా అవిష్కరణ సంప్రదాయం నిలుస్తోంది. తరతరాలుగా ఈ రెండు

మిగతా 8వ పేజీలో...



జడ్పీ ఆమెకే..

జిల్లా పరిషత్ పీఠం 'ఆమె'కే ఖరారైంది. రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ప్రకటించిన జడ్పీల రిజర్వేషన్ జాబితాలో నిజామాబాద్‌ను బీసీ మహిళకు కేటాయించారు. అంతకు ముందే జిల్లాలోని 31 జడ్పీటీసీ స్థానాల్లో రిజర్వేషన్లను ప్రకటించారు. వాటిలో 22 స్థానాలలో బీసీ మహిళలకు పోటీచేసే అవకాశం ఉంది. బీసీ మహిళ, బీసీ జనరల్, జనరల్ స్థానాలలో పోటీచేసి విజయం సాధించిన ఏ మహిళకైనా జడ్పీ పట్టాభిషేకం దక్కనుంది. కాగా గత ఎన్నికలలో జడ్పీ పీఠం జనరల్‌గా రిజర్వు అయింది. కాగా అధికారులు ముమ్మర కసరత్తు చేసి రిజర్వేషన్ల లెక్కతేల్చడంతో ఎన్నికల సందడి మొదలయ్యింది. గత రిజర్వేషన్లకు భిన్నంగా ఈ సారి రిజర్వేషన్లను ఖరారు చేయడంతో ఆశావహుల అంచనాలు తలకిందులవుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి చూపిన రిజర్వేషన్లు కలిసి రాక పోవడంతో పలువురు నేతలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో తమ అనుచరులను గెలిపించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు.

బీసీ మహిళకు దక్కనున్న జిల్లా పరిషత్ పీఠం

» ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ రిజర్వేషన్లు ఖరారు
» 42 శాతం రిజర్వేషన్‌తో బీసీలకు పెరిగిన స్థానాలు
» 31 జడ్పీటీసీల్లో 14 మహిళలకు..
» 16 స్థానాల్లోని మహిళా అభ్యర్థులకు 'కుర్చీ' అవకాశం
» ఆశావహుల నుంచి తీవ్ర పోటీ

నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల హడావిడి మొదలైంది. జిల్లా యంత్రాంగం జిల్లా పరిషత్ చైర్మన్ స్థానంతో పాటు జిల్లా ప్రాదేశిక నియోజక వర్గాలు(జడ్పీటీసీ), ఎంపీపీ, మండల ప్రాదేశిక నియోజకవర్గాలు(ఎంపీటీసీ) సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లా వ్యాప్తంగా 31 జడ్పీటీసీలు, 31 ఎంపీపీలు, 307 ఎంపీటీసీలు, 545 సర్పంచ్‌లు, 5,022 వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేశారు. జడ్పీ పీఠం బీసీ మహిళకు కేటాయించగా, జిల్లా వ్యాప్తంగా 31 జడ్పీటీసీలలో బీసీలకు 13, జనరల్‌కు 10, ఎస్సీ 5, ఎస్టీలకు 3 స్థానాలు కేటాయించగా ఎంపీపీలు బీసీలకు 13, జనరల్ 10, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3 కేటాయించారు. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మహిళలకు జడ్పీటీసీలు 14, ఎంపీపీలు 14 స్థానాలు కేటాయించారు.

'అతివ'కే దక్కిన అవకాశం...

కలెక్టర్ ఆధ్వర్యంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ స్థానం రిజర్వేషన్ మాత్రం రాష్ట్రస్థాయిలో ప్రకటించాల్సి ఉండటంతో రిజర్వేషన్ ఏదీ ఖరారు అవుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది. కాగా ఆ స్థానం రాత్రి పొద్దుపోయాక బీసీ మహిళకు కేటాయించినట్లు ప్రకటించారు. దీంతో వివిధ పార్టీల్లో ఉన్న ఆ వర్గం నాయకుల్లో ఉత్సాహం నెలకొంది. అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్‌లు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లా పరిషత్‌ను గెలుచుకునేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆయా పార్టీల నుంచి జిల్లా పరిషత్ కుర్చీని ఆశిస్తున్న ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

మిగతా 8వ పేజీలో...



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'స్థానిక' ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు

» కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి వెల్లడి
» రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో కొనసాగిన ప్రక్రియ

నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణలో భాగంగా జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను అనుసరిస్తూ రిజర్వేషన్లను ఖరారు చేయడం జరిగిందని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ అంకిత్, జడ్పీ సీఈవో సాయాగౌడ్, డిప్యూటీ సీఈవో సాయన్నలతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియ నిర్వహించారు. జిల్లాలోని 31 జడ్పీటీసీ,

మిగతా 8వ పేజీలో...

• నవీపేటలో కిక్కిరిసిన మేకల సంత



'మేక' శకళ..

» నవీపేట మేకల సంతలో భారీగా క్రయవిక్రయాలు
» శనివారం ఒక్కరోజే రూ. 8కోట్ల టర్నోవర్

నవీపేట,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన జిల్లాలోని నవీపేట మేకల సంతలో భారీగా క్రయ, విక్రయాలు జరిగాయి. శనివారం ఒక్కరోజే సుమారు రూ.8కోట్ల మేకల వ్యాపారం జరిగిందని వ్యాపారులు అంచనా వేశారు. రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం పెద్ద ఎత్తున వ్యాపారులు సంతకు తరలివచ్చారు. ఈ నెల 2న జరిగే దసరా పండుగ సందర్భంగా మేకల వ్యాపారం జోరుగా కొనసాగగా దసరా పండుగ ముందు రోజు మహర్నవమి రోజున యంత్రాలు, రైస్‌మిల్లులు, వాహనాలకు మేకలను కోసే ఆనవాయితీ ఉంది. సంతలో ఆడ మేకల కంటే మేక పోతుల ధర 2వేల నుంచి 3వేల రూపాయలు అధికంగా పలికినప్పటికీ మేకపోతుల కొనుగోళ్లు భారీగా జరిగాయి. మాములు వారాలకంటే ఈ వారం మేకలకు డిమాండ్ ఎక్కువగా ఉందని వ్యాపారులు పేర్కొన్నారు. సంతలో స్థలం సరిపోకపోవడంతో నెహ్రూ రోడ్డులో సైతం మేకల క్రయ విక్రయాలు జరిగాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సంత పూర్తిగా బురదమయంగా మారింది. అయినప్పటికి బురదగా మారిన సంతలోనే మేకల వ్యాపారం కొనసాగింది. మేకల సంతలో కనీస సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైన ఉందని వ్యాపారులు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, చిత్రంలో రూరల్ ఎమ్మెల్యే

హమాలీల సమస్యలపై అసెంబ్లీలో సీఎంతో చర్చిస్తా

» ఘనంగా ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలు
» ఓట్ చోరీపై రాహుల్ యాత్ర అభినందనీయం
» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హమాలీల సమస్యలు అసెంబ్లీలో, సీఎంతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ప్రభుత్వాలు మారిన హమాలీల సమస్య యదావిధిగానే ఉన్నాయని అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఉమామహేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన మార్కెట్ యార్డు హమాలీ, దడువాయి, చాట, స్వీపర్, వర్కర్స్ ఏఐటీయూసీ రెండవ మహాసభలకు ఆయన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఐటీయూసీ నాయకులు, హమాలీలు వ్యవసాయ మార్కెట్ యార్డు నుంచి ప్రభాత్ టాకీస్, శివాజీచౌక్, లలితా మహల్ థియేటర్ మీదుగా సమావేశం హాల్ వరకు ర్యాలీ నిర్వహించారు. రెండో మహాసభలో రాష్ట్ర, జిల్లా నాయకులు జెండాను ఆవిష్కరించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన ఓట్‌చోరీ అభినందనీయమని అన్నారు. కేంద్రంలో ప్రభుత్వం దొంగ ఓట్లతోనే అధికారంలోకి వచ్చిందని ఎద్దేవ చేశారు. రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు, కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. ఈ సభలో వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ ముప్పగంగారెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు విలాస్, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, పరుశురాం, శ్రీనివాస్‌గౌడ్, అనసూయపాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

సామాజిక తనిఖీకి.. నిర్లక్ష్యపు మకిలీ..

» ప్రజావేదికలతో ఫలితమేమి ?
» రాత్రివేళ ఉపాధిహామీ ప్రజావేదిక
» కానరాని ప్రజలు, ఉపాధి కార్మికులు

ఎడపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజావేదికలను మమ అన్నట్లుగా నిర్వహించి సామాజిక తనిఖీ అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. కేవలం కాగితాల్లోనే లెక్కలు చూపుతూ మాయ చేస్తున్నారు. ఇప్పటి వరకు 15 సార్లు సామాజిక తనిఖీ ప్రజావేదికలను నిర్వహించినా ఎలాంటి రికవరీ జరగలేదు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేయాల్సిన 16వ విడత ప్రజావేదిక సమావేశం సాయంత్రం 6 గంటలకు నిర్వహించారు. సమావేశంలో మండలంలోని ఏ ఒక్క గ్రామానికి చెందిన ఉపాధి హమీ కూలీ లేకుండానే ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్‌డీవో ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియలో ఉండి ఆలస్యమయిందని చెబుతూ ఉపాధిహామీ లొసుగులు ప్రజలకు తెలియకుండా ఉండేందుకే రాత్రివేళ ప్రజావేదిక నిర్వహించారని మండల ప్రజలు వాపోతున్నారు. ప్రజావేదికలో డీఆర్‌డీఏపీడీ సాయాగౌడ్, విజిలెన్సు అధికారి నారాయణ, సీసీ శరత్, ఏపీవో శ్రీవాణి, మండల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వాది, స్వాతంత్ర్య పోరాట యోధుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా ఈ ఉత్సవాలను జరిపారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, బీసీ, పద్మశాలి కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల కొండ లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, పద్మశాలి, బీసీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో ..

జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో అదనపు డీసీపీ బస్వారెడ్డి కొండలక్ష్మణ్ బాపజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ కార్యాలయ పరిపాలన అధికారి అశియా బేగం, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్, బషీర్, వనజ రాణి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, తిరుపతి, వీరయ్య పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

జిల్లా పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్ రెడ్డి, సిర్ప రాజు, కొత్తూరు లక్ష్మరెడ్డి, రమణ రావు, చింత మహేష్, చింతకాయల రాజు, నీలం రెడ్డి, బి. శ్రీనివాస్, కంతారావు, జలపతి రావు, కుమార్, సాదిక్ పాల్గొన్నారు.

అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లతో విరివిగా
ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

• ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ

నిజామాబాద్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నెలకొల్పిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లలో నైపుణ్యంతో కూడిన శిక్షణ పొందడం ద్వారా యువతకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అందుబాటులోకి తెచ్చిన 65 అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను శనివారం హైదరాబాద్ లోని మల్లెపల్లి ఏ.టీ.సీ సెంటర్ నుంచి మంత్రులు జి.వివేక్ వెంకటస్వామి, డి.శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా లాంచనంగా ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలోని శివాజీనగర్ లో గల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐ.టీ.ఐ) ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఏ.టీ.సీ కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఏ.టీ.సీ కేంద్రాల ప్రిన్సిపాల్స్ ఇన్ స్ట్రక్టర్లు, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న షబ్బీర్‌అలీ

యాదిలో..



తెలంగాణ వచ్చాక ఆదరణ పెరిగింది

తెలంగాణ వచ్చాక బతుకమ్మకు ఆదరణ పెరిగింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఆడటంతో బతుకమ్మ విశిష్టత నలుమూలలా వ్యాపించింది. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ వారింట్లో పండుగ వచ్చిందంటే సందడి వాతావరణం ఉండేది. తిరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజించి పాటలు పాడుతూ బతుకమ్మను నిమజ్జనం చేసేవాళ్లం. ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ ఇది.

- శాంత, తహసీల్దార్, ధర్పల్లి



పండగ వచ్చిందంటే మురిసిపోయేటోళ్లం

బతుకమ్మ పండగ వచ్చిందంటే గ్రామంలో మహిళలందరూ మురిసిపోయేవాళ్లం. మా చిన్నప్పుడు ఎక్కువగా వ్యవసాయ, ఇంటిపనులకే పొద్దుపోయేది. బతుకమ్మ పండగ వస్తుందటే మాలో సంతోషం కలిగేది. బతుకమ్మ సంబరాలను 9రోజులపాటు చేసుకునే సమయంలో అందరూ ఒక్కచోట కలిసి అప్యాయంగా ప్రేమలను పంచుకునేవాళ్లం. అందంగా తయారుచేసిన బతుకమ్మలను తెచ్చిపెట్టి ఆటపాటలతో సంబరాలను జరుపుకునేవాళ్లం.

- మొగుళ్ల భాగవ్వ, గర్గుల్, కామారెడ్డి మండలం



బతుకమ్మ అంటే ఎంతో సంబురం

బతుకమ్మ పండగ వచ్చిందంటే ఎంతో సంబురం కలిగేది. పొద్దుగాల లేచి పనులు చేసుకొని పొలాలకు, అడవుల్లోకి వెళ్లి తీరొక్క పూలు తెచ్చేవాళ్లం. అందరూ పోటీ పడి అందంగా బతుకమ్మలను తయారు చేసేవాళ్లం. చిన్నపెద్ద తేడాలేకుండా అందరం కలిసి ఆటపాటలతో సందడి చేసేటోళ్లం. ఆడుకునేటప్పుడు అక్కాచెల్లెళ్ల గీసులాడుకుంటుంటే.. ఎంబటే కలిసిపోతుండే. అమ్మానాన్నలు మమ్మల్ని చూసి నవ్వేటోళ్లు.

- అల్లం వీరమణి, భిక్కనూరు



క్రైం సమాచారం

ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

నవీపేట,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బినోలకు చెందిన ముంత పోశెట్టి(56) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారని ఎస్సై తిరుపతి తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న పోశెట్టి ఈనెల 26న ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాకె, ఆయనను వెంటనే అంబులెన్స్‌లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పోశెట్టి శనివారం మృతి చెందారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

జక్రాన్‌పల్లి , సెప్టెంబరు, 27(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ చోరీ కేసుల్లో నిందితుడు కోనేటి నరేష్ అలియాస్ రాజును శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డిచ్‌పల్లి సీఐ వినోద్, జక్రాన్‌పల్లి ఎస్సై ఎండీ మాలిక్ కుమార్ తెలిపారు. వారి కథనం ప్రకారం.. కోనేటి నరేష్ మండలంలోని గన్యతండాలోని గుడిలో ఈనెల 17న, సికింద్రాపూర్‌లో ఒకరి ఇంట్లో చోరీ చేశారని వారు తెలిపారు. జక్రాన్‌పల్లి బస్టాండ్ వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించగా అతడిని పట్టుకున్నారు. నిందితుడిని పడకల్‌కు చెందిన కోనేటి నరేష్‌గా గుర్తించారు. అతడి నుంచి 9 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేశామన్నారు. రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదం.. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి మృతి

సదాశివనగర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్రియాల్ 44వ జాతీయరహదారి జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి ముత్తినేని సూర్యరావు(67) మృతిచెందినట్లు ఎస్సై పుష్పరాజ్ తెలిపారు. సూర్యరావు కామారెడ్డి నుంచి శ్రీ కృష్ణ ఉడిపి హోటల్‌కు తన బైక్‌పై ఉదయం వస్తుండగా హైదరాబాద్ నుంచి వస్తున్న కారు వెనక నుంచి ఢీకొంది. తీవ్రగాయాలుకావడంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించామని ఎస్సై వివరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం

ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఎల్లారెడ్డి పోలీసుస్టేషన్ పరిధిలోని ఆజామాబాద్‌లో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి శివయ్య పని నిమిత్తం హైదరాబాద్ వలస వెళ్లాడు. తన కూతురు శనివారం వచ్చే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోని రూ.50వేలు, 6తులాల వెండి కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుబ్రమణ్యచారి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. దుండగులు తాళం వేసి ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్ల ఎంపిక

ఎడపల్లి , సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీలు, గ్రామ పంచాయతీల వార్డు సభ్యుల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేయ డానికి మండల పరిషత్ కార్యాల యంలో అన్ని పార్టీల నాయకులతో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ దత్తా త్రి శనివారం సమావేశం నిర్వహించారు. ఎడపల్లి మండలంలో 17 పంచా యతీలలో ఏ వార్డు ఏ సామాజికవర్గానికి కేటాయించాలో డ్రా తీసే సమ యంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, ఇతర పార్టీల నాయకులను సమావేశానికి ఆహ్వానించారు. సమావేశంలో నాయకులు సంజయ్, శ్రీరాం, శ్రీనివాస్, రహీం పాల్గొన్నారు.

నాలుగున్నర తులాల బంగారం చోరీ

నవీపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన దోమల రమేష్ ఇంట్లో శనివారం సాయంత్రం నాలుగున్నర తులాల బంగారం, రూ.20వేల నగదు చోరీకి గురైందని ఎస్ఐ తిరుపతి తెలిపారు. రమేష్ భార్య లలిత ఇంటి తలుపులు దగ్గరగా వేసి, లోపలి గదిలోకి వెళ్లారని, ఇదే సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో ఉన్న బంగారం, నగదు చోరీ చేశారని తెలిపారు. లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఆట'ంకాలు

- అధ్వానంగా క్రీడాప్రాంగణాలు
- వసతులు లేక యువత ఆటలకు దూరం

ఏర్గట్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. క్రీడా ప్రాంగణాలు ఊరికి దూరంగా, సరైన దారి లేని చోట నిర్మించడంతో వాటిపై పట్టింపు కరవైంది. దీంతో క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచుకునే అవకాశం కోల్పోతున్నారు. మండలంలోని ఎనిమిది గ్రామాల్లో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణాల్లో పిచ్చి మొక్కలు మొలిచి అధ్వాన్నంగా మారాయి. నాగేంద్రనగర్ క్రీడా ప్రాంగణం పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి భయానకంగా తయారైంది. అటువైపు చూసే వారే లేకుండా పోయారు.

నిర్వహణ శూన్యం.. పరికరాలు కరువు

మండలంలో ఏర్పాటు చేసిన 8 క్రీడా ప్రాంగణాలకు గ్రామపంచాయతీలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. కానీ వాటిని పట్టించుకోకపోవడంతో నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. క్రీడా ప్రాంగణాల్లో పరికరాలు సరిగా లేవు. మైదానాలు తూతూ మంత్రంగానే ఏర్పాటు చేయడంతో ఉన్న పరికరాలు తుప్పు పట్టిపోయాయి. అధికారులు స్పందించి ఆటస్థలాలను అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.



అధ్వానంగా నాగేంద్రనగర్ క్రీడా ప్రాంగణం

నిధులు లేక నిర్వహణ చేపట్టలేదు



నిధులు లేక క్రీడా ప్రాంగణాల నిర్వహణ భారంగా మారింది. గ్రామ పంచాయతీల్లో నిధులు లేక ఇబ్బందిగా ఉంది. క్రీడా ప్రాంగణాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించి, అందుబాటులోకి తీసుకొస్తాం. గ్రామీణ తప్పకుండా క్రీడాకారులను ప్రోత్సహిస్తాం.

- వెంకటేశ్వర్లు, ఎంపీడీవో, ఏర్గట్ల

పేదోళ్ల సొంతింటి కల నెరవేర్చాం

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

బోధన్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పేదోళ్ల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్‌దేనని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలో ఒక పేదవాడికి కూడా ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశపు మందిరంలో అమ్దాపూర్‌కు చెందిన 24మంది లబ్ధిదారులకు లాటరీ ద్వారా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నంబర్లు కేటాయించి, పట్టాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టి ఆదుకుంటున్నారన్నారు. అర్హులందరికీ ఇళ్లను ఇస్తామన్నారు. కొంత జాగా కలిగి ఉండి ఇల్లు నిర్మించుకోవాలనుకునే వారికి ఇందిరమ్మ పథకంలో భాగంగా రూ.5 లక్షలు అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంత్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, ఎంపీవో మధుకర్, కాంగ్రెస్ నాయకులు సురేందర్, పల్లెన్న, రమేష్, సంజీవ్‌రెడ్డి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్ల పట్టాలు ఇస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

హెల్మెట్‌పై వాహనదారులకు అవగాహన

రెంజల్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా వాడాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. శనివారం కళ్యాపూర్‌లో వాహనదారులకు హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. హెల్మెట్ వాడకం అత్యంత ప్రాముఖ్యమని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు తమ కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. వాహనం నడిపి ఇంటికి సురక్షితంగా వచ్చేందుకు హెల్మెట్ ఎంతగానో సురక్షితంగా ఉంటుందని, ద్విచక్రవాహనదారుడు హెల్మెట్ వాడకం అత్యంత ఉపయోగకరమని పేర్కొన్నారు. ఆయన వెంట రెండో ఎస్సై రాజు, కళ్యాపూర్ గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంద్రమోహన్

శిశు సంక్షేమ శాఖ విస్తీర్ణ అధికారిగా మౌనిక

బోధన్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి):పట్టణానికి చెందిన ఆర్.మౌనిక మహిళా,శిశు సంక్షేమ శాఖ విస్తీర్ణ అధికారిగా ఎంపికయ్యారు. ఆమె ప్రస్తుతం బోధన్ మున్సిపాలిటీలో వార్డుఅధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మహిళ శిశు సంక్షేమశాఖ విస్తీర్ణ అధికారిగా ఉద్యోగం సాధించడంతో తండ్రి బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ అప్పాలనాయుడు, తల్లి, పట్టణ వాసులు అభినందించారు.



ఆర్.మౌనిక

మాకు సొంత పీఏసీఎస్‌లు కావాలి



మహాజన సభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు మల్కారెడ్డి

ఎడపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి సహకార సంఘం మండల మహాజన సభను శనివారం అధ్యక్షుడు మల్కారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార సంఘం కార్యదర్శి రాజారాం సహకార సంఘం జమ ఖర్చులను సభలో చదివి వినిపించారు. రబీ పంట కాలంలో ప్రభుత్వం బోనస్ ఇస్తామని చెప్పి, వడ్లు కొనుగోలు చేసి బోనస్ ఇవ్వలేదన్నారు. ఇందుకు సభలో సభ్యులు నిరసన తెలిపారు. నష్టాల్లో ఉన్న సహకార సంఘాన్ని అందరి సహకారంతో లాభాల బాట పట్టించామని, ఇందుకు సహకరించిన సభ్యులకు అధ్యక్షుడు మల్కారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రబీ పంట బోనస్ ఇవ్వాలని తీర్మానం చేశారు. ఎడపల్లి సహకార సంఘంలో పరస్పర ఒప్పందంతో విలీనమైన కుర్నాపల్లి, ఠాణాకలాన్ సంఘాలు సొంత పీఏసీఎస్‌లు కావాలని ఆ ఆ యా గ్రామాల సభ్యులు కోరడంతో తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు విన్నవిస్తామని అధ్యక్షుడు చెప్పారు. మహాజన సభలో సంఘం సభ్యులు సుమన్, అనీల్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

కులరహిత సమాజం కోసం పోరాడుదాం

ఆర్మూర్‌టౌన్,సెప్టెంబరు,27 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తితో కులరహిత సమాజం కోసం పోరాడుదామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా సంయుక్త జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో ఏర్పాటుచేసిన కుల నిర్మూలన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో కులం ఆనవాళ్లు కొనసాగుతున్నాయని, ప్రభుత్వాలు సైతం పట్టించుకోకుండా.. ఓట్ల కోసం పార్టీలు కుల రాజకీయాలకు పూనుకుంటున్నాయని చెప్పారు. కులరక్కసిని తరిమేయడానికి యువత కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి.దేవరాం, ముత్తెన్న, సురేష్, రమేష్, రాజేశ్వర్, కిషన్, సత్తెవ్వ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వి.ప్రభాకర్

మంజీరా వరదలో నీటమునిగిన పంటలు

బోధన్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని హంగర్గ, కొప్పర్గ తదితర గ్రామాలతోపాటు మంజీర పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీటమునిగాయి. నిజాంసాగర్ గేట్లు ఎత్తివేయడంతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఎక్కువగా వస్తోంది. ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్‌తో హంగర్గ పరిసరాల్లోని పొలాలు నీటమునడంతో సోయాపంట చేతికి రాకుండా పోయింది. మంజీర పరివాహకంలోని హున్సా, మందర్నా, ఖాజాపూర్‌లలోనూ పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. ఇలాంటి పరిస్థితి ఎప్పుడు రాలేదని ప్రజలు పేర్కొంటున్నారు.



దెబ్బతిన్న సోయాపంట

సావెల్ యువకుడు కిరణ్‌కు గ్రూప్ 1 కొలువు

మెండోర, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని సావెల్‌కు చెందిన ధన్‌పాల్ కిరణ్ గ్రూప్ 1 ఉద్యోగం సాధించారు. కిరణ్ అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా నియమితులు కాగా.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లో నియామక పత్రం అందుకున్నారు. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్ 1 ఉద్యోగం సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఇది తమ గ్రామానికి గర్వకారణమని వారు పేర్కొన్నారు.



ధన్‌పాల్ కిరణ్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటా

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి):మండలకేంద్రానికి చెందిన విజయలక్ష్మీ కుటుంబానికి రూ.2లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శనివారం అందజేశారు. ఇటీవల విజయలక్ష్మీ గుండె సంబంధిత సమస్యతో నిమ్స్‌లో చేరారు. బాధిత కుటుంబీకులు ఎమ్మెల్యేకు తమ పరిస్థితి వివరించగా రూ.2 లక్షల ఎల్‌వోసీని అందజేశారు. అధైర్యపడొద్దని, అండగా ఉంటానని ప్రశాంత్‌రెడ్డి భరోసా కల్పించారు.



ఎల్‌వోసీ ఇస్తున్న ఎమ్మెల్యే



రుద్రూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న సిద్దార కాలేజీ విద్యార్థినులు

పూల సింగిడి.. అంతటా సందడి

జిల్లావ్యాప్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకుంటున్నారు. శనివారం మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలు ఉంచి.. బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. చిన్నారులు కోలాటాలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం గ్రామ శివారులోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ వేడుకలతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. ఆర్మూర్ జంబిహనుమాన్ ఆలయంలోని బతుకమ్మ ఆడిన మహిళలకు కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వినయ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, మార్కెట్ కమిటి చైర్మన్ సాయిబాబాగౌడ్, ఆలయ కమిటి చైర్మన్ సత్యనారాయణ తదితరులున్నారు. ఆర్మూర్ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో శనివారం బతుకమ్మ సంబురాలను నిర్వహిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ యాదవ్, అధ్యాపకులు రాకేష్, బాల్‌రాజ్, అర్వింద్, రాజశేఖర్, శ్రీధర్, ప్రమోద్, రజనీకాంత్, అర్చన, నికిత, సుమలత, నవనీత, అపూర్వ పాల్గొన్నారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



బతుకమ్మ ఆడిన మహిళలకు బహుమతులు ఇస్తున్న వినయ్‌రెడ్డి



కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం

నగర పాలక సంస్థలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- పాల్గొన్న ఉద్యోగులు, సిబ్బంది

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఒక్కేసి పువ్వేసి చందమామ... మూడుజాములాయే చందమామ... రాముడు సీతమ్మను పెళ్లాడే కోల్... అంటూ బతుకమ్మ పాటలతో నగర పాలక సంస్థ ఘనంగా వేడుకలు నిర్వహించింది. శనివారం నగర పాలక సంస్థ ప్రాంగణంలో కమిషనర్ దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహిళా ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ వేడుకలు జరిపారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి అందులో గౌరమ్మను ఉంచి పూజించారు. ప్రాంగణం చుట్టూ బతుకమ్మను ఊరేగింపు నిర్వహించి బతుకమ్మ చుట్టూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అప్పుడే వచ్చెను ఉయ్యాలో... శ్రీలక్ష్మిదేవి ఉయ్యాలో... సృష్టి బతుకమ్మ ఆయే ఉయ్యాలో... అంటూ పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. మహిళ ఉద్యోగులు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక అన్ని శాఖలకు సంబంధించిన మహిళ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపల్‌లో బతుకమ్మ ఆడుతున్న దృశ్యం



కెట్‌పల్లిలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



జన్నేపల్లిలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

దుర్గమ్మకు కుంకుమార్చనలు

జిల్లా వ్యాప్తంగా దుర్గానవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు భక్తులకు రోజుకో రూపంలో దర్శనమిస్తున్నారు. శనివారం జిల్లాలోని ఆయా దుర్గామండపాల్లో కుంకుమార్చనలు ప్రత్యేకపూజలు చేపట్టారు. మహిళలు పెద్ద ఎత్తున ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నవీపేట మండలం జన్నేపల్లిలోని దుర్గామాత మండపంలో మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



ఆర్మూర్‌లో కుంకుమార్చనలో మహిళలు



పచ్చలనడ్కుడలో..

సునీల్‌రెడ్డి పరామర్శ

భీమ్‌గల్ , సెప్టెంబరు, 27(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పలువురు బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి పరామర్శించారు. ఒకటో వార్డులోని సూర గోపి భార్య ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే కాంగ్రెస్ నాయకులు రంజిత్ వాళ్ల తండ్రికి గుండె ఆపరేషన్ జరగడంలో ఆయన కుటుంబసభ్యులు కూడా పరామర్శించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నవీపేట,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో శనివారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చొరవతో పలువురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు మంజూరు కాగా సంబంధిత చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, నర్సింగ రావు, సంపత్, కొండయ్య, పోశెట్టి తదితరులున్నారు.

మృతదేహం తరలింపు


సాలూర,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రానికి చెందిన షాదుల్లా(65) శనివారం నిజామాబాద్ జనరల్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మరణించారు. షాదుల్లాకు అనాథ అని తెలుసుకున్న కొందరు మేము సైతం స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ గైని నవీన్‌కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే అంబులెన్స్‌ను ఏర్పాటు చేసి సాలూరకు షాదుల్లా మృతదేహన్ని తరలించగా.. అంత్యక్రియలు పూర్తిచేశారు.

వేల్పూర్‌లో వైద్య శిబిరం

వేల్పూర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 9మంది స్పెషలిస్టులు మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలు చేసి, మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యురాలు వీణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

అసలైన తెలంగాణవాది కొండా లక్ష్మణ్ బాపూజీ

వేల్పూర్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం పరితపించిన అసలైన తెలంగాణ వాది ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా తన నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బలహీన వర్గాల స్ఫూర్తిదాత అని కొనియాడారు. జిల్లావ్యాప్తంగా బాపూజీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. - ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్



నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి



కమ్మర్‌పల్లిలోపాల్గొన్న ముత్యాల సునీల్‌కుమార్



బోధన్ మున్సిపాలిటీలో..

యాదిలో..



వారం ముందు నుంచే తిరిగే వాళ్లం..

గ్రామీణ ప్రాంతాల్లో బతుకమ్మ సంబరాలు గతంలో జోరుగా సాగేవి. వారం ముందు నుంచే పూల కోసం అటవీ ప్రాంతాలకు వెళ్లి రంగురంగుల పూలు కోసుకొచ్చి బతుకమ్మ చేసేవాళ్లం. చేతి చప్పట్లతో బతుకమ్మ పాటలకు వలయాకారంగా తిరుగుతూ ఆడేవాళ్లం. చిన్నపిల్లలను బతుకమ్మలతో పాటు మధ్యలో కూర్చోబెట్టి గౌరమ్మలుగా పూజించే వాళ్లం.

● విఠాబాయి, పెద్ద తడుగూర్, మద్నూర్



ప్రకృతిలో లభించే పూలతోనే..

ప్రకృతిలో సహజసిద్ధంగా లభించే తంగేడు, గునుగు, గుమ్మడి, చామంతి పూలతో బతుకమ్మను పేర్చి ఆడేవాళ్లం. ప్రస్తుతం ప్రకృతి పూలు లభించక రంగు, రంగుల కాగితాలతో తయారైన బతుకమ్మలు వాడుతున్నారు. బతుకమ్మలు పేర్చే ప్రకృతి పూలల్లో ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉంటాయని పెద్దలు చెప్పేవారు.

● నర్సుబాయి, మాజీ సర్పంచ్, మద్నూర్



బాధ్యతలున్నా.. బతుకమ్మ ఆడుతా..

బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉంటుంది. ఏటా చేసే వృత్తిలో బాధ్యతలు ఎన్ని ఉన్నా బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొంటా. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయానికి ప్రతీక బతుకమ్మ వేడుకలు. ప్రతి ఆడపడుచు సంబరంగా జరుపుకొనే పండుగ బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు అమ్మవారిని పూజించడం వల్ల అనుగ్రహం ఉంటుంది.

● సువర్ణ, తహసీల్దార్, నసురుల్లాబాద్





డీజీపీ శివధర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

నూతన డీజీపీని కలిసిన జుక్కల్ ఎమ్మెల్యే

జుక్కల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీ శివధర్ రెడ్డిని హైదరాబాద్‌లోని పోలీస్ కార్యాలయంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జుక్కల్ నియోజకవర్గం మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్నందున పోలీస్ శాఖ ప్రత్యేకంగా నిఘా పెట్టాలని కోరారు.

కుట్టు మిషన్ అందజేత

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పేదింటి మహిళ విజయలక్ష్మికి శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేశారు. లయన్స్ అధ్యక్షుడు రమేష్, క్లబ్ అధ్యక్షులు రమేష్, జోన్ చైర్మన్ సంతోష్, క్లబ్ సభ్యులు ప్రభుదాస్ కిషోర్, విఠల్, సంతోష్, కిరణ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విజయదశమి వేడుకలు

మద్నూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎస్‌ఎస్(రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్) మద్నూర్ శాఖ ఆధ్వర్యంలో విజయదశమి వేడుకలను ఆదివారం మండల కేంద్రంలోని గురు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఈ ఏడాది విజయదశమి నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న శుభ తరుణంలో ఏర్పాటుచేసిన ఉత్సవంలో సుమారు 500మంది స్వయం సేవకులు పాల్గొని గ్రామంలో శోభాయాత్ర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

ఆసుపత్రిలో అవగాహన

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంసీహెచ్ ఆస్పత్రిలో శనివారం స్వస్త్‌నారీ స్వశక్తీ కుటుంబ్ పరివార్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు వైద్యసేవలతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.విజయలక్ష్మీ, డా. విజయభాస్కర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా. విద్య, ఆర్‌ఎంవో డా.సుజాత, సీహెచ్‌వో దయానంద్, సుధాకర్, రవి ఉన్నారు.

కాత్యాయని దేవీ అవతారంలో అమ్మవారు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. 5వ రోజు అమ్మవారు కాత్యాయని దేవీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఆయా చోట్ల ఏర్పాటుచేసిన మండపాలకు ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకొని హోమాలు, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. మధ్యాహ్నం వేళ అన్నదానాలు, రాత్రి యువతుల దాండియా, కోలాటాల ఆటలతో పండగ వాతావరణం నెలకొంటోంది.

● ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్



బీర్కూర్ మండలకేంద్రంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భవానీ మాలధారులు



బాన్సువాడలో కాత్యాయని దేవీగా అమ్మవారు



ఇస్రోజివాడిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బాన్సువాడలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం



ఇబ్రహీంపేట్‌లో అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

కాలభైరవ స్వామి ఆలయంలో హైకోర్టు జడ్జి పూజలు

రామారెడ్డి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రామారెడ్డి మండల కేంద్రం- ఇసన్నపల్లి గ్రామాల మధ్య వెలిసిన దక్షిణకాశీగా విరాజిల్లుతున్న శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలోని గర్భగుడిలో శనివారం హైకోర్టు జడ్జి ఎస్.నరసింగ్ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన పురోహితులు శ్రీనివాస్ శర్మ సిందూర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ విశిష్టత, అభివృద్ధి గురించి ఈవో బుర్ల ప్రభు రాంచంద్రం గుప్తా వివరించారు. ఈ సందర్భంగా జడ్జి నరసింగ్‌రావు మాట్లాడుతూ.. అనతి కాలంలోనే ఆలయం అభివృద్ధి చెందడం హర్షణీయమని అన్నారు. ఆయన వెంట కామారెడ్డి జిల్లా జడ్జిలు సీహెచ్.వీఆర్‌ఆర్ వరప్రసాద్, సుధాకర్, కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమణ, దేవునిపల్లి ఎస్సై భువనేశ్వర్ రావు, రామారెడ్డి ఏఎస్‌ఐ రాజు, అధికారులు, ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జడ్జికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయకమిటీ సభ్యులు

బాధిత కుటుంబానికి రూ.60వేల చెక్కు పంపిణీ

రామారెడ్డి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగంపేట గ్రామంలో బాధిత కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేసినట్లు శనివారం మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన ధరణి మమతకు రూ.60 వేల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరవగా పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జిల్లా వాసికి బంగారు పతకం

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ తరఫున ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన డెకాథ్లాన్ అథ్లెటిక్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లా వాసి పరుశురాం బంగారు పతకం సాధించినట్లు అసోసియేషన్ సెక్రటరీ అనిల్ తెలిపారు. ఈ నెల 23వ తేదీ నుంచి 25వ తేదీ వరకు అండర్-20 డెకాథ్లాన్‌లో 6237 పాయింట్లు సాధించి పథకం సాధించి రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు.

ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడికి సన్మానం

భిక్కనూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మండలంలోని అంతంపల్లి విండో సీఈవో శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. శ్రీనివాస్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ మేరకు విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు శనివారం ఆయనను సన్మానించి జ్ఞాపిక అందజేశారు. విండో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు బోనస్ ఇవ్వాలి

● మహాజన సభలో అన్నదాతల డిమాండ్

మోపాల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులు వేసిన సన్నరకం బియ్యానికి 500 రూపాయల బోనస్ తక్షణమే ఇవ్వాలని అన్నదాతలు కోరారు. శనివారం మండలంలోని మోపాల్ సొసైటీ అధ్యక్షుడు గంగారెడ్డి అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ.. బోనస్ విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. పండించిన ధాన్యాన్ని రైస్‌మిల్‌కు తీసుకెళ్లేందు లారీ డ్రైవర్లు బస్తాకు రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఒక్కో రైతు రూ.1000 నుంచి రూ.1200 నష్టపోవాల్సి వస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు క్రమపద్ధతిలో నిర్వహించాలని, కొంత మంది డైరెక్టర్లు జోక్యం చేసుకొని వారికి కావాల్సిన వరి ధాన్యాన్ని ముందుగా తరలిస్తున్నారని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలులో సొసైటీ డైరెక్టర్లు జోక్యం చేసుకోవాలని అన్నారు. అనంతరం అధ్యక్షుడు గంగారెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఏ ఇబ్బందులు ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇకపై రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తానని భరోసా ఇచ్చారు. సమావేశంలో డైరెక్టర్లు గంగారాం, సతీష్‌రెడ్డి, ఉమాపతిరావు, నరేందర్, రాజశేఖర్‌రెడ్డి, లింగవ్వ, చిన్నరెడ్డి, కార్యదర్శి సాయి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక దోపిడీని నిలువరించాలి

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సంపన్న వర్గాల కోసం జీఎస్టీ పేరుతో దోబూచులాట ఆడుతూ ఆర్థిక దోపిడీ చేస్తుందని, ఆర్థిక దోపిడీని నిలువరించాల్సిన బాధ్యత ఉందని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య డిమాండ్ చేశారు. శనివారం డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గించామంటూ గొప్పలు చెప్పుకోవడం బీజేపీ మళ్లీ ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో వేల్పూర్ భూమయ్య, సాయిబాబా, సాయిరెడ్డి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

1000 మందికి ఆరోగ్య పరీక్షలు

సిరికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ మెగా ఆరోగ్య శిబిరానికి మండలానికి చెందిన వివిధ గ్రామాల నుంచి వైద్య పరీక్షలు చేయించుకోవడానికి ప్రజలు అధికసంఖ్యలో తరలివచ్చార. జిల్లా కేంద్రం నుండి తొమ్మిది మంది వైద్యులు ఈ మెగా వైద్యా శిబిరానికి వచ్చి రోగులను పరీక్షించారు. సిరికొండ మండల వైద్యాధికారి అరవింద్, డా.సుశాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి సుమారు వేయి మంది రోగులు హాజరయ్యారు. మహిళలు 800కు పైగా పరీక్షలు చేయించుకోగా, పురుషులు సుమారు 200 మంది పరీక్షలు చేయించుకున్నారు. డా.రమ్య, డా.జైన్, డా.అక్షయ్, డా.ప్రియాంక, డా.గౌతమీ, డా.సయ్యద్ ఆయేషా ఖాద్రీ, డా.ప్రదీప్ శిబిరంలో పాల్గొని రోగులను పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. 26 మందిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు మెడికల్ అధికారి డా.అరవింద్ చెప్పారు.



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యురాలు

ధర్మపురి శ్రీనివాస్ జయంతి వేడుకలు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ జయంతి సందర్భంగా శనివారం నగరంలోని బైపాస్ రోడ్డులోని ఆయన విగ్రహానికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, రాష్ట్ర కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. డి.శ్రీనివాస్ జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని గుర్తుచేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్పగంగారెడ్డి, గోర్త రాజేందర్, అమృతాపూర్ గంగాధర్ పాల్గొన్నారు.

● డీఎస్ జయంతి సందర్భంగా బైపాస్ రోడ్‌లోగల డీఎస్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో డీఎస్ పాత్ర ఎంతో ఉందని అన్నారు.

● నగరంలోని ప్రగతినగర్‌లోగల ఆయన నివాసంలో ఆయన అనుచరులు జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన సోదరుడు ధర్మపురి సురేందర్, ఆకుల రమేష్, వెంకటేష్, ఆకుల రాజేశ్వర్, పుప్పాల శోభ, అనిల్, తదితరులు పాల్గొన్నారు.



డీఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

కాంగ్రెస్ నాయకుల సంబరాలు

బాన్సువాడటౌన్, బీర్కూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన నేపథ్యంలో శనివారం కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

● జీవో నంబర్- 9 ద్వారా బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించినందుకు బీర్కూర్ మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు బసవరాజ్, రఘు, రాములు, సందీప్, శశికాంత్, రాములు రాజప్ప, కిరణ్, రఫీ, మన్నన్, ఆరిఫ్, మొగులుగొండ, లక్ష్మీనారాయణ, సాయిలు గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.



బీర్కూర్‌లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ఘనంగా కొండా లక్ష్మణ్ జయంతి



బాన్సువాడ మున్సిపల్ కార్యాలయంలో బాపూజీ జయంతి వేడుకల నిర్వహణ

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను శనివారం నిర్వహించారు. కమిషనర్ శ్రీహరిరాజు బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బాపూజీ చిత్రపటానికి పూలమాలాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధన కోసం పదవిలను సైతం లెక్కచేయకుండా మలిదశ ఉద్యమానికి మార్గదర్శకులుగా నిలిచిన గొప్ప వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో మేనేజర్ వాసంతి, వార్డు అధికారులు అంజయ్య, సూర్య వర్ధన్, జ్యోతి, సిబ్బంది సుజాత సిద్దు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పలు వార్డులను పరిశీలించారు. వర్షాలకు కాలనీలలో నిలిచిన నీరు దిగువకు వెళ్లేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయనతో పాటు ఏఈ వినోద్, వార్డు అధికారి ఉన్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

బీర్కూర్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దామరాంచకు చెందిన కనిగిరి సుధాకర్ అనే వ్యక్తిని శనివారం తహసీల్దార్ సాయిభుజంగరావు ఎదుట పోలీసులు బైండోవర్ చేశారు. పది రోజుల క్రితం దాబాలో అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు బైండోవర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా మరోసారి అక్రమంగా మద్యం విక్రయించనని, సత్ప్రవర్తనతో మెలుగుతానని సుధాకర్ తహసీల్దార్‌కు విన్నవించారు.

ఏటీసీతో ఉపాధి అవకాశాలు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను శనివారం ఆర్‌డీవో పార్థసింహారెడ్డి ప్రారంభించారు. నూతన టెక్నాలజీతో ఐటీఐను ఏటీసీగా మార్చడంతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకో వాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రూప నాయక్, మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిబా బా, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హమ్మ.. బౌబోయ్

బీర్కూర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా శునకాలు స్వైర విహారం చేయడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధుల్లో పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదో ఓ గ్రామంలో చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల బరంగ్ ఏడ్గి, కిస్టాపూర్, దామరంచ, బీర్కూర్ తదితర గ్రామాలలో కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. మూగజీవాలైన పశువులు, గొర్రెలు, మేకలపై కూడా దాడి చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో దాడులు జరుగుతున్నప్పటికీ కుక్కల నియంత్రణకు చర్యలు మాత్రం కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బీర్కూర్ మండలకేంద్రంలో గుంపులు గుంపులుగా శునకాలు

ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ..

బాన్సువాడటౌన్, మద్నూర్, నస్రులాబాద్, బీర్కూర్, భిక్కనూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడలో శనివారం అట్ల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఉమ్మడి మద్నూర్ మండలంలో గత సోమవారం నుంచి ప్రారంభమైన బతుకమ్మ సంబరాలు శనివారం సద్దుల బతుకమ్మతో ముగిశాయి. మండల కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద అంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో బతుకమ్మఆడిపాడారు. అనంతరం స్థానిక మైసమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. నస్రులాబాద్ మండలం దుర్కి శివారులోని నర్సింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ భూలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ సబురాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి- సతీమణి పుష్ప దంపతులు సంబరాల్లో పాల్గొన్నారు.

● భిక్కనూరు లోని ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ హాజరై బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు.



భిక్కనూరులో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న షబ్బీర్‌అలీ



పాతబాన్సువాడ చావిడి వద్ద వేడుకలు..



మద్నూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భిక్కనూరులో బతుకమ్మ ఎత్తిన ఎమ్మెల్యే పోచారం..

జిల్లా పరిషత్ ఆమెకే..

(5వ పేజీ తరువాయి)

పెరిగిన బీసీ స్థానాలు....

గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ సారి బీసీ స్థానాల సంఖ్య పెరిగింది. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలు చేయడంతో స్థానిక సంస్థల్లో బీసీల ఆధిక్యత పెరగనుంది. 31 జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల్లో 13 బీసీలకే కేటాయించారు. 2019 ఎన్నికల్లో 27 జడ్పీటీసీ స్థానాలకు గాను ఎస్టీలకు 3, ఎస్సీలకు 4, బీసీలకు 6, జనరల్16, కాగా ఎంపీపీలకు ఎస్టీలకు4, ఎస్సీలకు 4, బీసీలకు 5, జనరల్‌కు 14 స్థానాలు కేటాయించారు. కాగా జరుగబోయే ఎన్నికల్లో బీసీ 13 స్థానాలలో 6, జనరల్‌కు ఉన్న 10 స్థానాల్లో బీసీ మహిళలకు పోటీ చేసే అవకాశం ఉండటంతో మొత్తం 16 స్థానాల్లో బరిలో నిలిచిన నాయకురాళ్లకు జడ్పీ చైర్మన్ కుర్చీ దక్కించుకునే అవకాశం ఉంది.

బీసీ మహిళల నుంచి తీవ్ర పోటీ..

నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌ను బీసీ మహిళకు కేటాయించడంతో ఆ వర్గం నుంచి అన్ని పార్టీల్లో పోటీ నెలకొననుంది. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి మాక్లూర్ మండలం జడ్పీటీసీ బీసీ మహిళకు కేటాయించగా నందిపేట్ మండలం బీసీ జనరల్, బాల్కొండ నియోజకవర్గంలో వేల్పూర్ బీసీ జనరల్, మోర్తాడ్, మెండోరా, ఏర్గట్ల బీసీ మహిళ, బోధన్ నియోజకవర్గంలో నవీపేట బీసీ జనరల్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో మోపాల్, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లిలు బీసీ జనరల్, బాన్సువాడ నియోజకవర్గంలో మోస్రా, కోటగిరి బీసీ మహిళ, పోతంగల్ బీసీ జనరల్ రిజర్వేషన్లు ఖరారు చేశారు. బాల్కొండ, కమ్మర్‌పల్లి, రేంజల్, నిజామాబాద్ రూరల్, సిరికొండ మండల జడ్పీటీసీ స్థానాలు జనరల్ స్థానాలుగా ఖరారు చేయగా ఆర్మూర్ రూరల్, భీంగల్ రూరల్, ఎడపల్లి, చందూర్, రుద్రూర్ మండలాలు జనరల్ మహిళ రిజర్వేషన్లు ఖరారు చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వ్ అయిన లేదా బీసీ మహిళకు రిజర్వ్ అయిన బీసీ జనరల్, బీసీ మహిళ, జనరల్, జనరల్ మహిళ స్థానాల నుంచి చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. ఆశావాహులు పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కేబినెట్ మంత్రి హోదా కలిగి ఉండటంతో జిల్లాలోని ప్రధాన పార్టీల నేతలు దక్కించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఈసారి ఎలాగైనా జడ్పీ పీఠం దక్కించుకోవాలనే ప్రయత్నంలో ఉండగా బీజేపీ సైతం కసరత్తులు చేస్తుంది. బీఆర్ఎస్ సైతం చాప కింద నీరులాగా జడ్పీ చైర్‌పర్సన్ పదవిని దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది.

జడ్పీటీసీ రిజర్వేషన్లు

	2019	2025
మొత్తం స్థానాలు	27	31
ఎస్టీ	3	3
ఎస్సీ	4	5
బీసీ	6	13
జనరల్	14	10

ఎంపీపీ రిజర్వేషన్లు

	2019	2025
మొత్తం స్థానాలు	27	31
ఎస్టీ	4	3
ఎస్సీ	4	5
బీసీ	5	13
జనరల్	14	10

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఇలా..

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
ఆర్మూర్ రూరల్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
మాక్లూర్	బీసీ మహిళ	బీసీ మహిళ
నందిపేట్	బీసీ జనరల్	బీసీ మహిళ
ఆలూర్	ఎస్సీ మహిళ	ఎస్సీ జనరల్
డొంకేశ్వర్	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ
బాల్కొండ	జనరల్	జనరల్ మహిళ
భీంగల్ రూరల్	జనరల్ మహిళ	బీసీ మహిళ
కమ్మర్‌పల్లి	జనరల్	జనరల్
వేల్పూర్	బీసీ జనరల్	బీసీ జనరల్
మోర్తాడ్	బీసీ మహిళ	బీసీ మహిళ
మెండోరా	బీసీ మహిళ	బీసీ జనరల్
ముప్కాల్	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
ఏర్గట్ల	బీసీ మహిళ	బీసీ మహిళ
బోధన్ రూరల్	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
రేంజల్	జనరల్	జనరల్
నవీపేట్	బీసీ జనరల్	జనరల్ మహిళ
ఎడపల్లి	జనరల్ మహిళ	జనరల్ మహిళ
సాలూరా	ఎస్సీ జనరల్	ఎస్సీ మహిళ
నిజామాబాద్ రూరల్	జనరల్	ఎస్టీ
మోపాల్	బీసీ జనరల్	జనరల్
డిచ్‌పల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్
సిరికొండ	జనరల్	జనరల్
ధర్పల్లి	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
జక్రాన్‌పల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్
ఇందల్వాయి	ఎస్టీ జనరల్	బీసీ మహిళ
వర్ని	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
మోస్రా	బీసీ మహిళ	బీసీ జనరల్
చందూర్	జనరల్ మహిళ	జనరల్ మహిళ
కోటగిరి	బీసీ మహిళ	బీసీ జనరల్
రుద్రూర్	జనరల్ మహిళ	జనరల్
పోతంగల్	బీసీ జనరల్	బీసీ జనరల్

18 వైన్స్ షాపులకు దరఖాస్తులు

బోధన్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): బోధన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 వైన్స్ షాపులున్నాయని వీటికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని బోధన్ ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావు అన్నారు. శనివారం బోధన్ ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్ డివిజన్‌లో 18 వైన్స్ షాపులకు ఎస్సీ కోటాలో 2, బోధన్ 1, కోటగిరి 1, గౌడ్స్ 1, సాటాపూర్ 1 రిజర్వ్ చేసినట్లు చెప్పారు. 3లక్షల నాన్ రిఫర్ చలానా డీడీతో ఈ నెల 26 నుంచి అక్టోబరు 18వరకు జిల్లాకేంద్రంలోని డీటీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వైన్స్ లక్కీ డ్రాలో పాల్గొనే వారు 3లక్షల రూపాయల డీడీ చెల్లించాలన్నారు. అక్టోబర్ 23వ తేదిన లక్కీ డ్రా తీయడం జరుగుతుందన్నారు. కొత్త వైన్స్ షాపులు డిసెంబర్ 1, 2025 నుండి ప్రారంభం అవుతాయన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు 3లక్షల చలానా డీడీ, మూడు ఫోటోలు, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాస్ట్ జిరాక్స్ జత పర్చాలన్నారు.

టెక్నాలజీని వినియోగించుకోవాలి

బోధన్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అడ్వాన్స్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఏటీసీ బిల్డింగ్‌ను ప్రారంభించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక పథకాలు చేపడుతున్నారన్నారు.


టెక్నాలజీ గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్‌గా 65 సెంటర్లను ప్రారంభించిన దృశ్యాలను బోధన్ ఏటీసీ కేంద్రంలో స్క్రీన్‌లో తిలకించారు. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందన్నారు. పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో రాని ఉద్యోగాలు కాంగ్రెస్ హయంలోనే యువత కోసం అనేక పరీక్షలు పెట్టి ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


త్రివర్ణ పతాకాన్ని సిద్ధం చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

త్రివర్ణ దసరా..

(5వ పేజీ తరువాయి)

కుటుంబాలు బాధ్యత తీసుకోవడం గమనార్హం. గ్రామంలో సంప్రదాయ విలువలు, ఏకతా భావన కొనసాగడానికి వీరి కృషి ముఖ్యమని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

కరోనాతో ఆచారానికి అంతరాయం

తరతరాలుగా ఎలాంటి విఘాతం లేకుండా కొనసాగిన ఈ సంప్రదాయం కరోనాకాలంలో మాత్రమే ఆగిపోయిందని గ్రామ పెద్దలు గుర్తుచేసు కుంటున్నారు. పాండమిక్ సమయంలో కార్యక్రమం జరగక పోయినా, తిరిగి ఉత్సాహంగా పునరుద్ధరించారు. ఈసారి అయితే మరింత వైభవంగా జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

గాంధీ జయంతి, దసరా కలయిక

ఈ ఏడాది గాంధీ జయంతి, దసరా పండగ ఒకే రోజున రావడంతో త్రివర్ణ పతకం ఆవిష్కరణకు ప్రత్యేకత ఏర్పడింది. ఇతర గ్రామాల ప్రజలు కూడా రాజంపేటకు తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని తిలకిస్తారు. "ఇలాంటి ఆచారం ప్రతి గ్రామంలో ఉంటే బాగుంటుంది" అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

60 ఫీట్ల ఎత్తులో జెండా ఎగురవేత

రాజంపేట మండల కేంద్రంలో దసరా పండుగ సందర్భంగా 60 ఫీట్ల ఎత్తులో త్రివర్ణ పతకాన్ని ఎగురవేయనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మండల కేంద్రంలోని చావడి వద్ద సమావేశమై వారు మాట్లాడారు. మండలంలోని చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కడ లేని విధంగా జెండా పండుగ కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

'స్థానిక' ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు

(5వ పేజీ తరువాయి)

ఎంపీపీ స్థానాల కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ రిజర్వేషన్లను వీడియో రికార్డింగ్ మధ్యన నిబంధనలు అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా రిజర్వేషన్లను ఖరారు చేశారు. 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లు, బీసీ డెడికేషన్ కమీషన్ నివేదికను అనుసరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమీషన్ సూచనల మేరకు బీసీ రిజర్వేషన్ల కేటాయింపు చేశామని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని మొత్తం 31 జెడ్పీటీసీ స్థానాలకు గాను ఎస్టీలకు 3 స్థానాలు రిజర్వ్ అయ్యాయని అందులో 1 మహిళకు రిజర్వ్ అయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఎస్సీలకు 5 జెడ్పీటీసీ స్థానాలు రిజర్వ్ కాగా మహిళలకు 2 స్థానాలు కేటాయించబడ్డాయని, బీసీలకు 13 స్థానాలు రిజర్వ్ కాగా వీటిలో 6 స్థానాలు మహిళలకు కేటాయించబడ్డాయని తెలిపారు. మిగతా 10 మండలాల్లో జనరల్ కేటగిరిలో ఉండగా వీటిలో 5 స్థానాలు మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. జిల్లాలోని 31 ఎంపీపీ స్థానాలకు ఎస్టీలకు 3, అందులో 1 మహిళకు రిజర్వ్ అయ్యిందని, ఎస్సీలకు 5 ఎంపీపీ స్థానాలు అందులో మహిళలకు 2 స్థానాలు కేటాయించబడ్డాయని అన్నారు. బీసీలకు 13 స్థానాలు రిజర్వ్ కాగా 6 స్థానాలు మహిళలకు కేటాయించబడ్డాయని మిగతా 10 మండలాలు జనరల్ కేటగిరిలో ఉండగా వీటిలో 5 మహిళలకు కేటాయించడం జరిగిందన్నారు. ఖరారైన రిజర్వేషన్ల వివరాలను ప్రభుత్వానికి ఎన్నికల కమీషన్‌కు నివేదించనున్నట్లు తెలిపారు.

రేపు నగరంలో 2కే రన్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈనెల 29న 2కే రన్ నిర్వహిస్తున్నట్లు మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సదానంద్ రెడ్డి, సందీప్ రావు, రవి కిరణ్, జగదీష్ చంద్రబోస్, వరీస్ అలీ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గుండె జబ్బులు నేటి సమాజంలో వేగంగా పెరుగుతున్నాయని అన్నారు. క్రమం తప్పని వ్యాయామం, సమతుల ఆహారం, ఆరోగ్య పరీక్షల ద్వారా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో గుండె సంబంధిత వ్యాధులపై అవగాహన పెంచడమే ఈ 2కే రన్ ఉద్దేశమని తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి తరపున ప్రజలందరు ఈ 2కే రన్ వాక్‌లో పాల్గొని ఆరోగ్యమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాధారణంగా 5వేల విలువగల కార్డియాలజీ ప్యాకేజీని కేవలం 999 రూపాయలకు అందిస్తున్నట్లు ప్రకటించారు.

ట్రాఫిక్ నియమాలపై అవగాహన

ఇందల్వాయి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు శనివారం కోర్టు చౌరస్తాలో నగరంలోని వందన స్కూల్ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై సిబ్బంది అవగాహన కల్పించారు.



విద్యార్థులతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ట్రాఫిక్ రూల్స్ ట్రాఫిక్ సిగ్నల్, వాహన దారులు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలపై విద్యార్థులతో ప్లకార్డులతో అవగాహన కల్పించారు. విద్యార్థులు రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే దాటాలని అదే విధంగా వాహనదారులు జీబ్రా క్రాసింగ్ వద్ద స్టాప్ లైన్‌కు ముందుగానే ఆపాలని, ట్రాఫిక్ సిగ్నల్ ఆకుపచ్చ, నారింజ, ఎరుపు రంగులు ఉపయోగిస్తూ వాహనదారులు ఎలా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. మైనర్ డ్రైవింగ్, హెల్మెట్ డ్రైవింగ్, సీట్‌బెల్టులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ ప్రసాద్, ట్రాఫిక్ పోలీసులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న అమ్మవారి విగ్రహం

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గాజుల్‌పేట్‌లో యూత్ ఆధ్వర్యంలో కొలువు దీరిన అమ్మవారు 9 రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు. 18వ వార్షికోత్సవం పురస్కరించుకొని అమ్మవారిని 9రోజుల పాటు దర్శనమిచ్చే అమ్మవారి రూపాలను ఏర్పాటు చేశారు. రోజుకో రూపంలో పూజించడంతో పాటు నైవేద్యాలు సమర్పించుకుంటున్నారు.


తొమ్మిది రూపాల్లో దర్శనమిస్తున్న అమ్మవారు


నివాళులు అర్పిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మానాల


నివాళులర్పిస్తున్న జడ్పీ మాజీ చైర్మన్



కమిషనరేట్‌లో పాల్గొన్న అదనపు డీసీపీ బస్వారెడ్డి

త్యాగశీలి.. కొండా లక్ష్మణ్ బాపూజీ

స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని వక్తలు పేర్కొన్నారు. శనివారం జిల్లావ్యాప్తంగా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, రాజకీయ పార్టీలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో బాపూజీకి నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. **- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్**

మాధవనగర్ బైపాస్‌లో ట్రాఫిక్ జామ్

ఇందూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలం పరిధిలోని మాధవనగర్ బైపాస్ వద్ద శనివారం భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. కిలో మీటర్ల మేరకు భారీ వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు గురయ్యాయి. బైపాస్ రోడ్డుకు కంఠేశ్వర్ వెళ్లే మార్గం, హైదరాబాద్ వెళ్లే మార్గంలో వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంట తర్వాత ట్రాఫిక్ క్లియర్ అయింది.

ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని హమాల్‌వాడి లోని శ్రీసంతోషిమాతా సాయిబాబా ఆలయ హుండీని శనివారం లెక్కించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల పర్య వేక్షణలో జరిగిన హుండీ లెక్కింపులో 49వేల 361 రూపాయలు ఆదాయం సమకూరింది. ఆదాయంలో 41వేల 750 రూపాయలు నోట్ల రూపంలో రాగా 7వేల 611 రూపాయలు నాణెల రూపంలో సమకూరింది. ఆలయ అర్చకులు శ్రీభాష్య కృష్ణమాచార్య, కార్యనిర్వాహణ అధికారి వేణు, చైర్మన్ గంగాకిషన్, ధర్మకర్తలు శ్రీనివాస్, శివకుమార్, శాంతాబాయి, రికార్డు అసిస్టెంట్ గాయత్రీ పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత



మనోరమ ఆసుపత్రిలో బతుకమ్మ సంబురాలు


మోపాల్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో..!

నిజామాబాద్‌కల్చరల్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): పూల పండుగను పురస్కరించుకొని గంగా స్థాన్ మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో బతు కమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం గంగాస్థాన్ ఫేస్-2లోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత హాజరయ్యారు. బతుకమ్మను పేర్చి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలతో బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతిలో పూసే ప్రతీ పువ్వు ఔషద గుణాన్ని కలిగి ఉంటుందని ప్రకృతితో మమేకం అయినప్పుడే మానవ జీవన మనుగడ సాగుతుందని అన్నారు. గౌరీ దేవతను పూజించి బతుకమ్మ వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుధా, అరుణ, మున్నూరుకాపు సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. మోపాల్ మండలం న్యాల్‌కల్, తదితర గ్రామాల్లోనూ వేడుకలు నిర్వహించారు.నగరంలోని మనోరమ ఆసుపత్రిలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. డా.నమ్రత, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లావాసికి జాతీయ అవార్డు


అవార్డు అందుకుంటున్న సింగం సుశ్మిత

నిజామాబాద్‌కల్చరల్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ఏటా వివిధ రంగాల్లో కృషిచేసిన వారికి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏరువాక ఫౌండేషన్ అందించే జాతీయ అవార్డును జిల్లాకు చెందిన సింగం సుశ్మిత అందుకున్నారు. శనివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు ఆమెకు అవార్డు అందజేశారు.

